క్లుప్తంగా

పీహెచ్‌సీ తనిఖీ



మాట్లాడుతున్న టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు

దుత్తలూరు: మండలంలోని నర్రవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం సందర్శించింది. టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించారు. నర్రవాడ గ్రామంలో క్షేత్రస్థాయి పరిశీలన చేసి గర్భిణులు, బాలింతలకు అందుతున్న ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం సభ్యుడు కె.రమేష్, మరో సభ్యుడు షైనీ, వైద్యులు మనోజ్ఞ, హరీష్, సిబ్బంది పాల్గొన్నారు.

పైలాన్‌కు మరమ్మతులు చేపట్టండి



పైలాన్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ వెంకటరమణారెడ్డి తదితరులు

సోమశిల: అనంతసాగరం మండలంలోని సోమశిల ప్రాజెక్ట్ సమీపంలో ఉన్న హైలెవల్ కెనాల్ పైలాన్‌ను సోమశిల ప్రాజెక్ట్ ఎస్ఈ వెంకటరమణారెడ్డి గురువారం పరిశీలించారు. పైలాన్ పరిసర ప్రాంతాల్లో కంపచెట్లు, పిచ్చి మొక్కలు ఎక్కువగా ఉండడంతో తొలగించాలని, మరమ్మతులు చేపట్టాలని సోమశిల ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దశరథరామిరెడ్డిని ఆయన ఆదేశించారు. వారి వెంట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవీంద్రప్రసాద్, జేఈ రామ్మోహన్ ఉన్నారు.

వైభవంగా కోట అంకమ్మకు పెద్ద ఊరేగింపు



కోట అంకమ్మ తల్లికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కొండాపురం: మండలంలోని గొట్టిగుండాల గ్రామంలో శ్రీకోట అంకమ్మ తల్లి తిరునాళ్లలో భాగంగా బుధవారం రాత్రి అమ్మవారికి పెద్ద ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గురువారం ఆలయం చుట్టూ బండ్లు తిరగడం, పొంగళ్లు పొంగించి మొక్కులు చెల్లించడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలను నిర్వహించారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు



సోమశిల: అనంతసాగరం మండలంలో గురువారం ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కరీంమొహిద్దీన్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై ఏపీటీఎఫ్ నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి మహబూబ్‌బాషా, మండల బాధ్యులు రియాజ్, తిరుపతిరెడ్డి, సంధాని, కరిముల్లా, రవి, ముజీబ్, ప్రభుకుమార్, షఫీ, అంజద్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బాబా మందిరంలో వార్షికోత్సవం



బాబాకు అభిషేకం చేస్తున్న అర్చకులు

సంగం: మండలంలోని వెంగారెడ్డిపాళెం గ్రామంలో ఉన్న సాయిబాబా మందిరంలో ధర్మకర్త ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక హోమాలు నిర్వహించి సాయిబాబాకు విశేష పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్చండి



మర్రిపాడు: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

అల్లూరు: తల్లిదండ్రులు బడి ఈడు పిల్లలను వ్యవసాయ పనులు, కూలీ పనులకు పంపకుండా పాఠశాలల్లో చేర్పాలని ఎంపీడీఓ జ్యోతి సూచించారు. 'నేను బడికి పోతా' కార్యక్రమానికి సంబంధించి గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 'నేను బడికి పోతా' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పంచాయతీ పరిధిలోని సంబంధిత అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి బడి ఈడు పిల్లలను గుర్తించి వారు పనులకు వెళ్లకుండా పాఠశాలలో చేరేలా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ దుర్గేశ్వర్‌రావు, ఈఓపీఆర్డీ వీరేంద్ర, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు పాఠశాలల్లో చేరేలా..

సంగం: 'నేను బడికి పోతా' కార్యక్రమంపై సంగం మండలస్థాయి కమిటీ సమావేశాన్ని ఎంపీడీఓ శేషగిరిరావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో జరిగిన ఈ సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేసుకుని, ఎన్యూమరేటర్లుగా నియమించిన గ్రామ వలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేరేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ జానకీరాం, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బుజ్జయ్య, ఏఎస్ఓ, పంచాయతీ కార్యదర్శులు, ఎడ్యుకేషన్, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పొంగూరులో..

మర్రిపాడు: మండలంలోని పొంగూరు గ్రామంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గురువారం 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ప్లకార్డులతో పొంగూరు వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, చైర్మన్లు, సచివాలయ సంక్షేమ, విద్యాసహాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ జ్యోతి

అవగాహన ర్యాలీ

మర్రిపాడు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని ఎంఈఓ-2 ధనలక్ష్మి, తహసీల్దార్ సీతారత్నం, ఎంపీడీఓ మనోహర్‌రాజు, పొంగూరులో ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. విద్యార్థులు ప్లకార్డులు చేతబట్టి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ధనలక్ష్మి మాట్లాడుతూ 'నేను బడికి పోతా' కార్యక్రమం జూలై 12వ తేదీ వరకు జరుగుతుందని, ప్రతి రోజూ మండలంలోని గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి బడి ఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించి డ్రాప్ అవుట్స్ లేని మండలంగా చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మర్రిపాడు: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నీటి పొదుపుపై వ్యాసరచన పోటీలు



మాట్లాడుతున్న ఎంఈఓ-2 ప్రభాకర్‌రెడ్డి

సోమశిల: అనంతసాగరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నీటి పొదుపు అనే అంశంపై 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు గురువారం వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 ప్రభాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీప్రసన్న, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు



గ్రామోత్సవంలో విహరిస్తున్న కోటేశ్వరస్వామి

సంగం: సంగంతోపాటు దువ్వూరు, తరుణవాయి, అన్నారెడ్డిపాళెం తదితర ప్రాంతాల్లో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం దువ్వూరులో గంగా పార్వతీ సమేత శ్రీకోటేశ్వరుడు చిలక వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. సంగంలో జరుగుతున్న మాతా పరమేశ్వరి అమ్మవారి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి బుధవారం అర్ధరాత్రి నుంచి గ్రామోత్సవం నిర్వహించారు. తరుణవాయి గ్రామంలో జరుగుతున్న ఉత్సవాల్లో కోదండరామస్వామికి హనుమంత సేవ నిర్వహించారు. హనుమంత వాహనంపై వచ్చిన కోదండరాముడిని భక్తులు దర్శించుకున్నారు.

ప్రతి రోజూ తాగునీటి సరఫరాకు ప్రతిపాదనలు



జేఆర్‌పేటలో తాగునీటి సరఫరాను పరిశీలిస్తున్న ఏఈ జూపల్లి ప్రసాద్


ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సరఫరాను ప్రతి రోజూ కొనసాగించేందుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నామని మున్సిపల్ ఏఈ జూపల్లి ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని జేఆర్‌పేట 4వ వార్డులో తాగునీటి సమస్యను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తమ ప్రాంతంలోని సమస్యలను స్థానిక ప్రజలు ఆయన దృష్టికి తెచ్చారు. తాగునీటి సరఫరాతోపాటు మురుగు కాలువల నిర్వహణ, వీధిలైట్ల ఏర్పాటు, రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ మేరకు అవసరమైన ప్రతిపాదనలు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో దాసరి మధు, శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ధైర్యం నింపిన జేవీవీ నాయకులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పట్టణంలోని వివిధ ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న బీసీ హాస్టల్‌లో దెయ్యాలు సంచరిస్తున్నాయంటూ ఏర్పడిన అపోహలను స్థానిక జనవిజ్ఞాన వేదిక సభ్యులు విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి వారిలో ధైర్యం నింపారు. వివరాలు.. బీసీ హాస్టల్‌లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు 70 మంది వరకు ఉంటూ చదువుకుంటున్నారు. ఇటీవల కాలంలో ఆ వసతి గృహాల్లో దెయ్యాలు సంచరిస్తున్నాయని వదంతులు రావడంతో ఆత్మకూరు జనవిజ్ఞాన వేదిక నాయకులు బుధవారం రాత్రి వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులను ఆరా తీశారు. అనంతరం వారు విద్యార్థులతో మాట్లాడుతూ ఆధునిక కాలంలో మంత్రాలు, తంత్రాలకు చోటులేదని, దెయ్యాలు భూతాలు అనేవి అభూత కల్పనలని తెలిపారు. కాగా 70 మంది విద్యార్థులు వసతి గృహంలో ఉండగా, వారికి నీటి వసతి, విద్యుత్ సౌకర్యం అందుబాటులోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ గదుల్లో ఫ్యాన్లు, లైట్లు సరిగా పనిచేయడం లేదని, 70 మందికి కలిపి 5 మరుగుదొడ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వసతి గృహం అద్దె భవనం శిథిలావస్థలో ఉందని, సొంత భవనం నిర్మించి విద్యార్థుల చదువులు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా జేవీవీ నాయకులు కోరారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు లక్కు ప్రసాద్, సందానీ, మురళీకృష్ణ, వాగాల శ్రీహరి, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌కు కుక్క అడ్డురావడంతో..

• వ్యక్తికి గాయాలు



చికిత్స పొందుతున్న సుకుమార్

ఆత్మకూరురూరల్: చేజర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లైబ్రరీ సైన్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న ముత్యాల సుకుమార్ (53) తన బైక్‌పై వెళ్తుండగా కుక్క అడ్డురావడంతో ప్రమాదం జరిగి కాలు విరిగిన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు ఆత్మకూరుకు చెందిన సుకుమార్ తన విధి నిర్వహణలో భాగంగా ఉదయం 9 గంటల సమయంలో ఆత్మకూరు నుంచి చేజర్లకు బైక్‌పై వెళ్తుండగా అప్పారావుపాళెం పెన్నా బ్రిడ్జి వద్దకు వెళ్లేసరికి అకస్మాత్తుగా ఓ కుక్క అడ్డురావడంతో దానిని ఢీకొట్టి కింద పడిపోయాడు. గాయాలు కావడంతో స్థానికులు గమనించి 108కు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రుడిని 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే కాలు విరిగినట్లు గుర్తించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించగా, ఓ ప్రైవేట్ వైద్యశాలలో సర్జరీ చేసినట్లు బాధితుల బంధువులు తెలిపారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం

అల్లూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దుర్గేశ్వర్‌రావు మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను సకాలంలో పరిష్కరించాలని, రెవెన్యూ సిబ్బంది ప్రజలతో మమేకమై వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపేలా కృషి చేయాలని సూచించారు.

24న అలఘునాథస్వామి కల్యాణం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పట్టణంలోని శ్రీదేవీ భూదేవీ సమేత అలఘునాథస్వామి ఆలయంలో శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ నెల 24న సాయంత్రం 4 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్ల కల్యాణం వీక్షించాలని కోరారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరాలో మార్పులు

దుత్తలూరు: మండలంలోని నర్రవాడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 11 కేవీ లైన్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు చేస్తున్నట్లు డిస్కం ఏఈ వెంకటసుబ్బయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్రవాడ సబ్‌స్టేషన్ పరిధిలోని వ్యవసాయ ఫీడర్‌కు శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు తెల్లవారుజామున 4 నుంచి ఉదయం 8 గంటల వరకు.. అలాగే సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు త్రీఫేజ్ సరఫరా ఇవ్వనున్నట్లు తెలిపారు. శ్రీవెంగమాంబ అమ్మవారి బ్రహ్మోత్సవాలకు సంబంధించి విద్యుత్ మరమ్మతులు చేస్తున్నందున ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నర్రవాడ, తెడ్డుపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

కలిగిరి: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, విశ్రాంత ఉపాధ్యాయుడు నందనవనం ప్రభాకరరావు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు యోగాపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

అవగాహన ర్యాలీ



సోమశిల: 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా గురువారం అనంతసాగరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతసాగరంలో ఎంఈఓ-2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 మాట్లాడారు. బడి బయట పిల్లలను బడిలో చేయాలని సూచించారు. అలాగే ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ ఆధ్వర్యంలో అనంతసాగరం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, సీఆర్పీలకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా డ్రాపౌట్స్ డేటాను సేకరించాలని తెలిపారు. బడి బయట ఉండే ప్రతి విద్యార్థి పాఠశాలలో చేర్పించేలా బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 ప్రభాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయుడు మెట్టుకూరు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవుడి మాన్యాల సర్వే

సోమశిల(చేజర్ల): చేజర్ల మండల పరిధిలోని ఆదూరుపల్లి, చిత్తలూరు గ్రామాల్లో శ్రీవీరభద్రస్వామి, శ్రీచెన్నకేశవస్వామి ఆలయాల దేవుడి మాన్యాలకు చెందిన పొలాల్లో గురువారం దేవదాయశాఖ, రెవెన్యూశాఖ అధికారులు సర్వే నిర్వహించారు.

వైభవంగా శ్రీనివాసుని కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఉదయగిరి: పట్టణంలోని బీసీకాలనీ సమీపంలో ఉన్న శ్రీసంతానలక్ష్మి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా 4వ రోజు గురువారం భక్తులు భూదేవీ శ్రీదేవీ సమేత శ్రీశ్రీనివాసుని కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అభిషేకం, అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను కల్యాణ వేదికపై కొలువుదీర్చి వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని వీక్షించారు.

బీసీజీ వ్యాక్సినేషన్ పరిశీలన



అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌పై అవగాహన కల్పిస్తున్న వెంకటసుబ్బయ్య

ఉదయగిరి: పట్టణంలోని బీసీకాలనీ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో గురువారం జరిగిన అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం క్షయ నియంత్రణ సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ మురళి, గండిపాళెం పీహెచ్‌సీ ఆరోగ్య విద్యాబోధకుడు కలసపాటి వెంకటసుబ్బయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా టీకాల నిర్వహణ రిజిస్టర్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. వయోజనులకు క్షయ వ్యాధి సోకకుండా ముందస్తుగా ప్రభుత్వం ఈ టీకాను ఉచితంగా అందిస్తోందని తెలిపారు. ఈ టీకా గురించి 18 ఏళ్లు పైబడిన వారు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి సోమ, గురు వారాల్లో సచివాలయాల పరిధిలో అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేస్తారని తెలిపారు. కార్యక్రమంలో క్షయ నియంత్రణ పర్యవేక్షకుడు భోగ్యం వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం నూర్జహాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైల్వే ప్రగతికి దశల వారీగా ఉద్యమం

బిట్రగుంట: బిట్రగుంట రైల్వే ప్రగతిపై స్థానికుల సహకారంతో దశల వారీగా ఉద్యమాన్ని తీవ్రతరం చేయనున్నట్లు బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ ప్రతినిధులు నూరుద్దీన్, బత్తల రవిచంద్ర, ఆరోగ్యరాజ్ తదితరులు తెలిపారు. బిట్రగుంటలోని రైల్వే సమస్యలు, రిజర్వేషన్ సేవలు రద్దు చేయడం తదితర అంశాలపై స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద 'రైల్ మదద్' యాప్ ద్వారా బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానికులు గురువారం ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా నూరుద్దీన్ తదితరులు మాట్లాడుతూ బిట్రగుంట రైల్వే ప్రగతిపై రైల్వే యంత్రాంగం అనుసరిస్తున్న తీరు సరికాదన్నారు. బిట్రగుంటను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతోపాటు ప్రయాణికుల వసతులు కూడా రద్దు చేస్తుండడం బాధాకరమన్నారు. త్వరలోనే స్థానికులు, విశ్రాంత రైల్వే కార్మికులు, రాజకీయ పార్టీల నాయకుల సహకారంతో దశల వారీగా ఉద్యమాన్ని తీవ్రతరం చేసి బిట్రగుంట ప్రగతికి కృషి చేస్తామని తెలిపారు.

రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు



బండ లాగుతున్న ఎడ్లు

కొండాపురం: మండలంలోని గొట్టిగుండాల గ్రామంలో వెలసిన శ్రీకోట అంకమ్మ తల్లి తిరునాళ్ల సందర్భంగా నిర్వాహకులు చివరి రోజు గురువారం రాష్ట్రస్థాయిలో ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రకాశం, వైఎస్సార్ జిల్లాలకు చెందిన ఐదు జతల ఎడ్లు పాల్గొన్నాయి. కమిటీ నిర్దేశించిన 2,500 కేజీల బండను 20 నిమిషాల్లో లాగేలా నిర్ణయించారు. వైఎస్సార్ జిల్లాకు చెందిన వింజంరెడ్డి రమణారెడ్డి ఎడ్లు నిర్ణీత సమయంలో 2,400 అడుగుల దూరం బండ లాగి ప్రథమ స్థానం సాధించి రూ.50 వేలు గెలుచుకున్నాయి. అలాగే వైఎస్సార్ జిల్లాకు చెందిన దారుసీల గురివిరెడ్డి ఎడ్లు రెండో స్థానంలో నిలిచి రూ.40 వేలు గెలుచుకున్నాయి. అలాగే ప్రకాశం జిల్లాకు చెందిన వీరాస్వామి చౌదరి ఎడ్లు మూడు స్థానంలో నిలిచి రూ.30 వేలు సాధించాయి. ప్రకాశం జిల్లా వీరాస్వామిచౌదరికి చెందిన ఎడ్లు నాలుగో స్థానం సాధించి రూ.20 వేలు గెలుపొందాయి. ప్రకాశం జిల్లాకు చెందిన మహబూబ్ చాంద్‌బాషా ఎడ్లు ఐదో స్థానంలో నిలిచి రూ.10 వేలు నగదు బహుమతి గెలుచుకున్నాయి. గెలుపొందిన వారికి నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు.

పరిపాలనకు మార్గదర్శకంగా రెవెన్యూ శాఖ



మాట్లాడుతున్న ఆర్డీఓ మధులత

ఆత్మకూరురూరల్: ప్రభుత్వ పరిపాలనకు రెవెన్యూ శాఖ మార్గదర్శకంగా పనిచేయాలని ఆత్మకూరు ఆర్డీఓ కురుబా మధులత పేర్కొన్నారు. రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఆత్మకూరులోని తన కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రెవెన్యూ ఉద్యోగులు ఇటీవల సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా పూర్తి చేసేందుకు కృషి చేశారని తెలిపారు. ప్రజలతో, రైతులతో స్నేహభావంతో మెలిగి సాధ్యమైన రెవెన్యూ సమస్యలు అన్ని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివనాగిరెడ్డి, ఆర్ఐ పృథ్వీకుమార్, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

బీసీజీ టీకాతో క్షయ నివారణ



బీసీజీ టీకా వేస్తున్న వైద్యసిబ్బంది

వరికుంటపాడు: వయోజనులు ముందస్తుగా ప్రభుత్వం అందిస్తున్న అడల్ట్ బీసీజీ టీకా వేయించుకోవడం ద్వారా క్షయ వ్యాధిని నిర్మూలించుకోవచ్చని స్థానిక పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజశేఖరరాజు తెలిపారు. ఆయన గురువారం వరికుంటపాడు మండలంలోని వెంగమాంబపురం, తిమ్మారెడ్డిపల్లె గ్రామాల్లో జరుగుతున్న బీసీజీ టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అడవి పేరంటాలమ్మ ఉత్సవాలు



ఉదయగిరి: మండలంలోని గన్నేపల్లి పంచాయతీలో జరుగుతున్న అడవి పేరంటాలమ్మ తల్లి ఉత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు బండ్లు పొంగళ్ల కార్యక్రమాన్ని జరుపుకున్నారు. నగరాలకు వలస వెళ్లిన వారు ఉత్సవాల సందర్భంగా పల్లెలకు రావడంతో సందడి నెలకొంది.